క్లుప్తంగా

కరాటేలో అంతర్జాతీయ పురస్కారం



పురస్కారాలు అందుకుంటున్న విద్యార్థులు

ఆమనగల్లు: నగరంలోని నాంపల్లి బిర్లా ఆడిటోరియంలో మాస్టర్ కేశవ్ కరాటే అకాడమీ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో గురువారం ఇంటర్నేషనల్ రైజింగ్ స్టార్ మార్షల్ ఆర్ట్స్ పురస్కారం అవార్డులను అందజేశారు. ఇందులో పట్టణానికి చెందిన సోను కరాటే అకాడమీ విద్యార్థులు పురస్కారాలను అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను సోను అకాడమీ నిర్వాహకులు అభినందించారు.

ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్

బడంగ్‌పేట్: పదేళ్ల అధికారంలో ఉండి, పేదలకు రేషన్‌కార్డులు ఇవ్వని బీఆర్ఎస్ నాయకులు.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. డబుల్ బెడ్రూం, రుణమాఫీ చేస్తామని బీఆర్ఎస్ పార్టీ ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. మాయమాటలతో మభ్యపెట్టారని విమర్శించారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రజలు ఆ పార్టీ నేతల మాటలు నమ్మి మోస పోవద్దని సూచించారు. ప్రజా ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు.

సెల్‌ఫోన్ అప్పగింత

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం పడకల్ గ్రామానికి చెందిన కుమార్.. ఇటీవల రూ.40 వేలు విలువ చేసే 1 ప్లస్ మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. అనంతరం బాధితుడు ఆమనగల్లు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. సాంకేతిక పరిజ్ఞానంతో ఫోన్ ఆచూకీ తెలుసుకుని, స్వాధీనం చేసుకున్నారు. గురువారం ఠాణాలో బాధితుడికి ఎస్‌ఐ వెంకటేశ్ ఫోన్‌ను అప్పగించారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

ఆమనగల్లు: బీజేపీతోనే మున్సిపాలిటీ అభివృద్ధి సాధ్యమని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి అన్నారు. పట్టణంలోని 6,7వ వార్డులో గురువారం రూ.16.5 లక్షలతో మురుగు కాలువలు, సీసీరోడ్ల నిర్మాణ పనులను చైర్మన్ రాంపాల్‌నాయక్, కౌన్సిలర్లు చెన్నకేశవులు, విజయ్‌కృష్ణలతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దుర్గయ్య, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు విక్రంరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు హరిప్రసాద్, కౌన్సిలర్లు లక్ష్మణ్, కృష్ణయాదవ్, బైకని శ్రీశైలం యాదవ్, నాయకులు శ్రీనివాస్, వెంకటయ్య, రాంరెడ్డి పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలకు మైక్‌సెట్ అందజేత

కడ్తాల్: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాలకు మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి గురువారం వసతిగృహ సంక్షేమాధికారి రాములకు మైక్ సెట్, బ్యాండ్ సెట్ అందజేశారు. విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు, స్థానిక నాయకులు చంద్రశేఖర్, రాంచంద్రయ్య ఉన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ మధు తదితరులు

మంచాల: చట్టాలపై ప్రజలకు అవగాహన ఉండాలని సీఐ మధు అన్నారు. గురువారం మండల పరిధి ఆస్మత్‌పూర్ గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలకు మరింత రక్షణగా ప్రభుత్వం షీటీం ఏర్పాటు చేసిందని తెలిపారు. ప్రత్యేక కౌన్సెలింగ్ ఏర్పాటు చేసి, బాధితులకు అండగా నిలుస్తున్నామని పేర్కొన్నారు. ఆన్‌లైన్ గేములతో మోసపోవద్దని సూచించారు. డయల్ 100 గురించి వివరించారు. ఏఎస్ఐ సతీష్ ఉన్నారు.

నేడు పాలకవర్గం వీడ్కోలు సన్మానం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మున్సిపల్ పాలకవర్గం పదవీ కాలం ముగుస్తున్న నేపథ్యంలో చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి, వైస్ చైర్‌పర్సన్ బర్ల మంగతో పాటు కౌన్సిలర్లకు శుక్రవారం ఉదయం 11 గంటలకు వీడ్కోలు, సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్ తెలిపారు.

అధ్వానదారులు..

రాకపోకలకు అవస్థలు
- కంకరతేలిన రోడ్లు.. వాహనదారుల ఇక్కట్లు
- ఎన్ఎస్‌జీ నుంచి పట్నం వరకు గోతులమయం
- మరమ్మతులకు నోచుకోని మార్గాలు



గుంతలు, కంకర తేలిన రాయపోల్ రోడ్డు

ఇబ్రహీంపట్నం రూరల్: రహదారులు నరకానికి నకళ్లుగా మారాయి. గుంతలు, కంకర తేలి వాహనదారులకు నరకం చూపిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం.. రోడ్లన్నీ సుందరీకరిస్తోంది. సింగిల్ రోడ్లను డబుల్‌గా నిర్మిస్తోంది. కానీ మారుమూల ప్రాంతాల రోడ్లను పట్టించుకోవడం లేదని ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు.

అడగడుగునా..

ఇబ్రహీంపట్నం నుంచి రాయపోల్‌కు సుమారు ఏడు కిలో మీటర్ల రోడ్డు. పది నిమిషాల ప్రయాణం. కానీ రాయపోల్ నుంచి పోల్కంపల్లి దారి మాత్రం పూర్తిగా గోతులు ఏర్పడి అధ్వానంగా మారింది. అయినప్పటికీ.. దశాబ్దకాలంగా ఈ రోడ్డును పట్టించుకునే వారే కరువయ్యారని ప్రాంత వాసులు, వాహనదారులు పేర్కొంటున్నారు. రెండు కిలో మీటర్ల రోడ్డే అయినా.. ప్రయాణం సాఫీగా సాగని దుస్థితి నెలకొందంటున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఈ మార్గం క్షేమం కాదని వాపోతున్నారు. రాయపోల్‌తో పాటు అనాజ్‌పూర్, సంఘీనగర్, హైదరాబాద్, విజయవాడ హైవేకు వెళ్లేందుకు ఈ రోడ్డు ఉపయోగకరంగా ఉంటుందని, వెంటనే మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.

నిధులు కేటాయించారు..

ఇబ్రహీంపట్నం నుంచి ఎన్ఎస్‌జీ మార్గం గుండా రోజుకు వేలాది వాహనాలు పరుగులు తీస్తుంటాయి. ఆక్టోపస్, ఎన్ఎస్‌జీ సంస్థలకు నిత్యం.. డీజీ, ఐజీ, అడిషనల్ డీజీ స్థాయి ర్యాంకు అధికారులు వచ్చిపోతుంటారు. అలాంటి రోడ్డు మరమ్మతులకు నోచుకోకపోవడంతో వాహనచోదకులు, ప్రయాణికులు నానా హైరానా పడుతున్నారు. మూడు కిలో మీటర్ల రోడ్డుకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.35 కోట్లు కేటాయించారు. మధ్యలో డివైడర్‌తో రోడ్డు వెడల్పునకు మార్కింగ్ సైతం చేశారు. కానీ ప్రభుత్వం మారడంతో.. మార్గం వేయలేదని పట్టణ ప్రజలు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రోడ్లకు మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.

పేరుగొప్ప ప్రాంతం



నాగన్‌పల్లి-ఎన్ఎస్‌జీ రోడ్డు దుస్థితి

ఇబ్రహీంపట్నం నుంచి ఎన్ఎస్‌జీ మీదుగా నాగన్‌పల్లి వరకు వెళ్లే రోడ్డు గుంతలను తలపిస్తోంది. నాగన్‌పల్లి నుంచి పోల్కంపల్లి వరకు సింగిల్ రోడ్డును డబుల్‌గా తీర్చిదిద్దారు. కానీ నాగన్‌పల్లి శివారు నుంచి పట్నం వరకు అధ్వానంగా మారింది. రక్షణ రంగ సంస్థలైన ఎన్ఎస్‌జీ, ఆక్టోపస్ లాంటి ప్రభుత్వ సంస్థలు, వైట్‌గోల్డ్ వస్త్ర పరిశ్రమ, కొత్తగా డిగ్రీ కళాశాల, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలు ఈ ప్రాంతంలో నెలకొన్నాయి. కానీ.. రహదారి సరిగా లేకపోవడంతో రాకపోకలకు ఇక్కట్లు తప్పడం లేదు.

“బస్సులు రావడం లేదు



రాయపోల్ రోడ్డులో ప్రయాణించలేక పోతున్నాం. గత ప్రభుత్వం రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించింది. పనులు చేపట్టలేదు. అధ్వాన రోడ్లతో గ్రామాలకు ఆర్టీసీ బస్సులు రావడం లేదు. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి స్పందించి, రెండు కి.మీ రోడ్డు పనులు చేయించి, రవాణా సౌకర్యం మెరుగుపరచాలి.

– సీహెచ్ రవిందర్, పోల్కంపల్లి

వాహనాలు మొరాయిస్తున్నాయి



ఇబ్రహీంపట్నం టౌన్ నుంచి నాగన్‌పల్లి శివారు వరకు రోడ్డు గుంతలమయంగా మారింది. వాహనాలు మొరాయిస్తున్నాయి. తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. పట్నం దాటగానే శివాలయం వద్ద నుంచి గోతులు, శ్మశాన వాటిక రోడ్డంతా అధ్వానంగా ఉంది. రోడ్లను బాగు చేయించి, రవాణా సౌకర్యం మెరుగు పర్చాలి.

– కొండ్రు ప్రవీణ్‌కుమార్, ఇబ్రహీంపట్నం

కార్మికులను క్రమబద్ధీకరించాలి

సీఐటీయూ నాయకుల డిమాండ్



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తుర్కయంజాల్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య, స్వచ్ఛ ఆటో కార్మికులను వెంటనే క్రమబద్ధీకరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కమిషనర్ అమరేందర్ రెడ్డి వినతిపత్రం అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాకు సరిపడా కార్మికులు లేకపోవడంతో గడిచిన రెండేళ్లుగా హరితహారం, ప్రైవేటు కాంట్రాక్టు పేరుతో సుమారు 50 మంది కార్మికులతో పలు రకాల పనుల చేయిస్తున్నారని పేర్కొన్నారు. వేతనాలు మాత్రం సకాలంలో చెల్లించడం లేదని ఆరోపించారు. వీరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించేలా కౌన్సిల్ తీర్మానం చేయించాలని కమిషనర్‌ను కోరారు. చెత్త సేకరించే వారికి ఒక్కో ఇంటికి రూ.150 చొప్పున ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.కిషన్, నాయకులు సత్యనారాయణ, యాదగిరి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహప్రతిష్ఠాపనకు ఆహ్వానం



ఆచారికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న గౌడసంఘం నాయకులు

ఆమనగల్లు: పట్టణంలోని శ్రీ కంతమహేశ్వర దేవాలయంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఈ నెల 30,31 తేదీలలో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారిని కార్యక్రమానికి ఆహ్వానిస్తూ.. గురువారం గౌడసంఘం నాయకులు అల్లాజీగౌడ్, గంగా రవీందర్‌గౌడ్, నిరంజన్‌గౌడ్‌లు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఇందులో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు హరిప్రసాద్, కౌన్సిలర్లు విక్రంరెడ్డి, లక్ష్మణ్, సంఘం నాయకులు నారాయణగౌడ్, యాదయ్యగౌడ్ ఉన్నారు.

ఆ ప్లాట్లకు రైతుభరోసా ఇవ్వొద్దు

అబ్దుల్లాపూర్‌మెట్: మూడు దశాబ్దాల క్రితం ప్లాట్లుగా చేసి, విక్రయించిన భూములకు రైతు భరోసా ఇవ్వకూడదని, ఇప్పటి వరకు అక్రమంగా రైతుబంధును తీసుకున్న వ్యక్తులపై తగిన చర్యలు తీసుకోవాలని గండిచెరువు వాసి జక్క పాపిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం కలెక్టర్ నారాయణ రెడ్డికి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గండిచెరువు గ్రామం సర్వే నంబర్ 188నుంచి 192,195 పార్ట్, 196,197,201,202ల లోని సుమారు 120 ఎకరాల భూమిని 1992,1993 సంవత్సరంలో లక్ష్మీప్రియానగర్, శివప్రియానగర్ కాలనీల పేరుతో లే అవుట్ చేసి ప్లాట్లుగా విక్రయించారని పేర్కొన్నారు. అలా కొనుగోలు చేసిన ప్లాట్లలో అనుమతుల తీసుకుని పలువురు నిర్మాణాలు చేపట్టారని, అయినప్పటికీ గతంలో ఆ భూములకు రైతుబంధు ఇచ్చారని తెలిపారు. మరలా రైతు భరోసా ఇవ్వనున్నట్లు జాబితాలో పేర్లు ఉన్నాయని వెల్లడించారు. రైతుభరోసా ఇవ్వకుండా నిలిపివేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశానని పాపిరెడ్డి తెలిపారు.

ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

ఆమనగల్లు: ఎమ్మార్పీఎస్ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం పట్టణంలోని శ్రీలక్ష్మి గార్డెన్స్‌లో సమితి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సమితి జిల్లా కోఆర్డినేటర్ ప్రశాంత్ మాదిగ, రాష్ట్ర కార్యదర్శి మందకృష్ణ మాదిగ, జిల్లా, మండల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫిబ్రవరి 7న నిర్వహించే వేల గొంతులు, లక్ష డప్పులు మహాప్రదర్శన కార్యక్రమం గురించి చర్చించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సమితి మండల అధ్యక్షుడిగా శ్రీశైలం మాదిగ, ఉపాధ్యక్షులుగా రమేశ్, జంగయ్య, ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్, అధికార ప్రతినిధిగా వెంకటాపురం శివ, ప్రచార కార్యదర్శిగా విజయ్‌కుమార్, కార్యదర్శిగా పరమేశ్, కార్యవర్గ సభ్యులుగా కిష్టయ్య, పుల్లయ్యలను నియమించారు.

సేవలతోనే సమాజంలో గుర్తింపు



అవార్డు అందుకుంటున్న మహేశ్

కడ్తాల్: సేవలతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని బీజేపీ మండల అధ్యక్షుడు, లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు కార్యదర్శి దోనాదుల మహేశ్ అన్నారు. లియోక్లబ్, లయన్స్ క్లబ్‌తో పాటు, రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్య శిబిరాలు, వృద్ధులకు దుప్పట్ల పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు, అనేక సామాజిక అంశాలపై అవగాహన సదస్సులు మహేశ్ నిర్వహించారు. అతని సేవలను గుర్తించిన తెలంగాణ సిటీజన్ కౌన్సిల్ నిర్వాహకులు.. 'యూత్ అండ్ నేషనల్ యునిటీ అవార్డు–2025'కు ఎంపిక చేశారు. ఈ మేరకు స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా గురువారం నగరంలోని నాంపల్లి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమలో సిటిజన్స్ కౌన్సిల్ అధ్యక్షుడు రాజ్‌నారాయణ్, హైకోర్టు రిటైర్డ్ జడ్జీ పీఎస్ నారాయణ, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కుమార్ మొలుగారంలు మహేశ్‌కు అవార్డు అందజేశారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- పారదర్శకంగా జాబితా
- ప్రజలు ఆందోళన చెందొద్దు
- గ్రామసభలో ప్రజాప్రతినిధులు, అధికారులు



ఆమనగల్లు: మున్సిపాలిటీ వార్డు సభలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్/ఆమనగల్లు: పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ నేపథ్యంలో గురువారం మండల పరిధి మైసిగండిలో నిర్వహించిన గ్రామసభలో ఆయన సంక్షేమ పథకాల అర్హుల పేర్లను ప్రదర్శించారు. ప్రజల అభిప్రాయాలు తెలుసుకున్నారు. కొత్తగా దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. ప్రజాపాలనలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులను ఎంపిక చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ చైర్ పర్సన్ యాట గీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, ఎంపీడీఓ సుజాత, ఏఓ శ్రీలత, మాజీ సర్పంచ్‌లు తులసీరాం, శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

నిరంతర ప్రక్రియ

ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని, అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందజేస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధి విఠాయిపల్లి వార్డు సభలో ఆయన కొత్త పథకాల అర్హుల పేర్లను చదివి వినిపించారు. దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామన్నారు. మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్ సుజాత, మున్సిపల్ కమిషనర్ వసంత, ఏడీఏ ఆదిలక్ష్మి, సీఐ ప్రమోద్‌కుమార్, ఎస్‌ఐ వెంకటేశ్, మార్కెట్ డైరెక్టర్ శ్రీశైలం ఉన్నారు.

సభల్లో గ్రామస్తుల ఆందోళన



ఎంపీడీఓ నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నల్లవెల్లి గ్రామస్తులు


యాచారం: ప్రభుత్వం కొత్తగా అమలు చేయనున్న పథకాల అర్హుల జాబితాలో మా పేర్లు ఎందుకు రాలేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. తక్కళ్లపల్లితండా, మాల్, తమ్మలోనిగూడ, నల్లవెల్లి, కొత్తపల్లి, తక్కళ్లపల్లి గ్రామాల్లో సభలు జరిగాయి. నల్లవెల్లి సభలో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు రాలేదని పలువురు ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, మండల పంచాయతీ అధికారి శ్రీలతకు ఫిర్యాదు చేశారు. తమ్మలోనిగూడలో ఇళ్లు లేక అద్దె ఇళ్లల్లో ఉన్నా.. ఇందిరమ్మ ఇళ్ల లిస్టులో తమ పేర్లు లేవని కొందరు ఆవేదన వ్యక్తంచేశారు. తక్కళ్లపల్లితండాలో అదే పరిస్థితి. అధికారుల సూచన మేరకు ప్రజలు మరోసారి దరఖాస్తు చేసుకున్నారు. సభల్లో తహసీల్దార్ అయ్యప్ప, మండల వ్యవసాయ అధికారి రవినాథ్ తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం: నెర్రపల్లి గ్రామసభలో తహసీల్దార్ సునీతరెడ్డి

సాగు భూములకే 'భరోసా'

- మండలంలో 4,918.29 ఎకరాలకు కోత
- నష్ట పోనున్న 350 మందికి పైగా రైతులు



యాచారం-మొండిగౌరెల్లి గ్రామాల మధ్య గుర్తించిన సాగు యోగ్యంగా లేని గుట్టలున్న భూమి



చౌదర్‌పల్లిలో భూ సర్వే చేస్తున్న అధికారులు

యాచారం: సాగుకు యోగ్యం కాని పట్టాదారు, పాసుపుస్తకాలున్న భూమికి రైతు భరోసా వర్తించదని ప్రస్తుత ప్రభుత్వం స్పష్టంచేసింది. బీఆర్ఎస్ హయాంలో గుట్టలు, రాళ్లు, రప్పలు, చెట్లతో కూడిన భూములకు సైతం ఎకరాకు ఏడాదికి రూ.10 వేల చొప్పున వానాకాలం, యాసంగి పంటలకు రైతుబంధు రైతుబంధు ఇవ్వగా.. ప్రస్తుత సర్కార్ రైతు భరోసా పేరిట ఎకరాకు ఏడాదికి రూ.12 వేల చొప్పున ఇవ్వనుంది. కానీ గతంలో కాకుండా.. సాగుకు యోగ్యమై భూములకే సాయం ఇచ్చేందుకు నిర్ణయించింది. ఇందులో భాగంగా వ్యవసాయ, రెవెన్యూ అధికారులు ఉమ్మడిగా రైతుల భూములను సర్వే చేసి, సాగు యోగ్యం, సాగుకు యోగ్యంకాని భూమిని గుర్తించారు.

రాళ్లు, రప్పలున్న భూములు

మండల పరిధి 24 గ్రామాల్లో పట్టాదారు, పాసుపుస్తకాలు కలిగిన 42,404.06 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. చౌదర్‌పల్లి- 87.18, గునుగల్-223.01, గడ్డమల్లయ్యగూడ- 19.06, మొండిగౌరెల్లి- 69.13. చింతుల్ల- 27.22, ధర్మన్నగూడెం -8.10, చింతపట్ల-166.22, తమ్మలోనిగూడెం -32.36, మంతన్‌గౌడ్, కేసీతండా-23.06, మంతన్‌గౌరెల్లి-173,09, సుల్తాన్‌పూర్-2.20, నల్లవెల్లి-460.32, మాల్-166.35, కొత్తపల్లి-764.34, కుర్మిద్ద-867.14, మేడిపల్లి-312.32, నక్కర్త-20.08, నానక్‌నగర్-244.12, తాడిపర్తి-390.17, మల్కీజ్‌గూడ-19.36, నందివనపర్తి-214.19, అయ్యవారిగూడెం-13.21, నస్దిక్‌సింగారం -56.09, తక్కళ్లపల్లి-220.33, తక్కళ్లపల్లితండా-19.62, యాచారం-282.23, మొగుళ్లవంపు -46.09 ఎకరాల వ్యవసాయ భూమిని సాగుకు యోగ్యంగా లేదని అధికార యంత్రాంగం గుర్తించింది. ఆయా భూమిలో గుట్టలు, రాళ్లు, రప్పలు న్నట్లు నివేదించింది.

నిషేధిత జాబితాలో..

మండల పరిధి పలు గ్రామాల్లో పదేళ్ల కిందట పంచాయతీ వెంచర్లు చేశారు. నింబంధనల ప్రకారం వెంచర్లు వేయకపోవడం, కన్వర్షన్ చేసినా రెవెన్యూ రికార్డుల్లో మార్చకపోవడంతో నేటికీ ఆ భూములకు ధరణి పోర్టల్ ద్వారా పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్నాయి. రైతుల పేరిట ఉన్న పాసుపుస్తకాలకు రైతుబంధు నిధులు వచ్చాయి. యాచారం, మాల్, గునుగల్, తక్కళ్లపల్లి, తమ్మలోనిగూడ, నందివనపర్తి తదితర గ్రామాల్లో వెంచర్లు ఉన్నాయి. ఈ వెంచర్లపై ఉన్న పట్టాదారు, పాసుపుస్తకాలను రద్దు చేసి నిషేధిత జాబితాలో పెట్టారు. వాటికి కూడా రైతుబంధు కట్ చేయడంతో పాటు ఆ పాసుపుస్తకాల రద్దుకు ఉన్నతాధికారులకు నివేదిక పంపారు.

కోత పెట్టడానికే..



ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తోంది. ఏడాది కాలంగా రైతు భరోసా పథకం ఇవ్వడం లేదు. సర్వే పేరిట జాప్యం చేసింది. ఇప్పుడు సాగు భూములకే భరోసా అంటూ మెలిక పెట్టింది. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చినట్లుగా సాగుసాయం వర్తింపజేయాలి. వెంచర్ల భూములకు ఇవ్వొద్దు. భవిష్యత్తులో సాగుకు యోగ్యంగా మార్చుకునే భూమికి రైతు భరోసా ఇవ్వాలి.

– బాష, రైతు నక్కర్తమేడిపల్లి

ఆదేశాలు పాటిస్తున్నాం



రైతుభరోసా పథకం అమలుపై సర్కార్ నింబంధనలు పాటిస్తున్నాం. సాగుకు యోగ్యం కాని, వెంచర్ల భూములకు భరోసా ఇవ్వడం లేదు. నిజమైన రైతులకు అన్యాయం జరగనీయం. పెట్టుబడి పెట్టి, పంటలు పండించే రైతులకు ఆర్థిక భరోసా ఇవ్వాలన్నదే సర్కార్ లక్ష్యం. మండలంలో 4,918.29 ఎకరాల భూమిని సాగుకు యోగ్యంగా లేదని గుర్తించాం.

– రవినాథ్, మండల వ్యవసాయ అధికారి

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

మంచాల: ఇళ్ల స్థలాలు లేక, సొంతింటి కలకు నోచుకోని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆగాపల్లి గ్రామస్తులు కోరారు. గురువారం గ్రామంలో జరిగిన గ్రామసభలో ఎంపీడీఓ బాలశంకర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామంలో సర్వే నంబర్ 128లో 7.26 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని తెలిపారు. ప్రభుత్వం ఇళ్ల స్థలాలు, ఇళ్లు లేని పేదలను గుర్తించి 60 గజాల చొప్పున అర్హులకు భూమి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు నర్సింహ, నాయకులు శేఖర్‌గౌడ్, రవి, దేవయ్య, యాదయ్య పాల్గొన్నారు.

'ప్రజలను మోసం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం'

ఆమనగల్లు: ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్ ఆరోపించారు. గురువారం ఆయన మాట్లాడారు. రుణమాఫీ పూర్తిగా అమలు చేయాలని, రైతులందరికీ రైతుభరోసా అందించాలని, అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇళ్లు ఉన్నవారికి, కాంగ్రెస్ కార్యకర్తలకే ఇళ్లు మంజూరు చేశారని ఆరోపించారు. ఇదే విషయమై ప్రజలు గ్రామ సభల్లో అధికారులను నిలదీస్తున్నారని, వారు సమాధానం చెప్పలేక మొహం చాటేస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు సాయిలు, రఘు, వెంకటేశ్, భాస్కర్, శివకుమార్, యాదయ్య, జగన్ ఉన్నారు.